సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 19 । మే । 2023



పంటలకు సిద్ధంకండి

వానాకాలం పంటలకు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులకు సూచించారు. 8లో▸

21న పలు రైళ్లు రద్దు

సాక్షి,సిటీబ్యూరో: చర్లపల్లి టెర్మినల్ వద్ద ఆర్‌యూసీ నిర్మాణ పనుల దృష్ట్యా ఈ నెల 21న ఆ రూట్లో నడిచే 17 రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ సీహెచ్ రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ నుంచి వరంగల్, రేపల్లె, సిర్పూర్ కాగజ్‌గర్, కాచిగూడ నుంచి మిర్యాలగూడ, వికారాబాద్ నుంచి గుంటూరు మధ్య నడిచే పలు రైళ్లు రద్దు కానున్నాయి.

నేడు షాద్‌నగర్‌కు కేంద్రమంత్రి

షాద్‌నగర్: 'బీజేపీ పార్లమెంట్ ప్రవాస్ యోజన' లో భాగంగా శుక్రవారం కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే షాద్‌నగర్‌కు రానున్నట్లు పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తిమ్మాపూర్‌కు రానున్నారు. అనంతరం కొత్తూరు మండలం ఎస్‌బీపల్లి, సాయంత్రం షాద్‌నగర్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

న్యూస్‌రీల్

రూర్బన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: రూర్బన్ స్కీం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం రూర్బన్ స్కీం ద్వారా కేటాయించిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండలంలో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, ఈఈ పీఆర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: షాద్‌నగర్‌కు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం జీఓ నంబర్ 35 జారీ చేసింది. కళాశాలను 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నారు.ఈ కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సులను మంజూరు చేసింది. కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులతో పాటు రూ.16.49కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ షాద్‌నగర్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటు దన్నారు. అడిగిన వెంటనే కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

డీపీఎం సూర్య

ఇబ్రహీంపట్నం రూరల్: సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం సూర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక సదరం సర్టిఫికెట్‌ను ఇవ్వాలని కలెక్టర్ కోరడం జరిగిందని, కొండాపూర్, వనస్థలిపురం ప్రభుత్వ హాస్పిటల్‌కు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 18న ప్రభుత్వ ఆస్పత్రి కొండాపూర్, 19న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, 20న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వనస్థలిపురం, కొండాపూర్, 23న కొండాపూర్ ఆస్పత్రుల్లో, 26న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, 27న కొండాపూర్ ఆస్పత్రుల్లో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో మొదటి విడత 338 మంది దివ్యాంగుల వివరాలను డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు పంపించి గుర్తించబడిన దివ్యాంగులను సదరం క్యాంపులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కొత్తూరు: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. నందిగామ మండలం చేగూరులో గురువారం సెయింట్ థెరిస్సా శంషాబాద్ ఆస్పత్రి నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉరుకులు..పరుగుల జీవనంలో చాలామంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. ఆరోగ్య సమస్యలు తీవ్రమైన తర్వాత ఆస్పత్రులకు వెళ్తే ఖర్చులతో పాటు ఇబ్బందులు ఉంటాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. ప్రాథమిక దశలోనే పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటిస్తే చాలా వరకు ప్రయోజనం ఉంటుందన్నారు. పేదలకు క్షేత్రస్థాయిలోనే నాణ్యమైన వైద్యం అందించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. శిబిరంలో భాగంగా వైద్యులు సుమారు 200 మందికి బీపీ, షుగర్‌తో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ప్రియాంక, సర్పంచ్ మామిళ్ల సంతోష, రజిత, నాయ కులు అశోక్, శ్రీశైలం, నరేందర్, వైద్యులు కేతన్, హిమ, వినీత తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి

గ్రేటర్‌లోకి శివారు పురపాలికలు

- ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల విలీనంపై ప్రతిపాదనలు
- మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు?



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్‌రోడ్డు లోపలి పుర/నగరపాలికలు/గామ పంచాయతీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయనున్నారా? అంటే కాదనలేని పరిస్థితి నెలకొంది. అయిదేళ్ల క్రితమే కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు కావడానికి ముందు సైతం ఈ ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, కార్యరూపం దాల్చలేదు. దాని బదులు కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. శివారు ప్రాంతాలు రోజురోజుకూ శరవేగంగా విస్తరిస్తుండటంతో పాటు అక్కడ జరుగుతున్న భవన నిర్మాణాలు, వ్యాపారాలు తదితరమైనవి ఎక్కువగా ఉంటున్నప్పటికీ, మౌలిక సదుపాయాల కల్పన మాత్రం ఆ స్థాయిలో జరగడం లేదు. గ్రేటర్‌లో అందుబాటులోకి వచ్చిన ఫ్లైఓవర్లు తదితర రవాణా సదుపాయాలతో ఓఆర్ఆర్ వరకు ప్రయాణం సుగమమైంది. కొత్తగా ఎన్నో లింక్‌రోడ్లు రానున్నాయి. శివారు ప్రజలకు సదుపాయంగా ఎన్నో కల్పిస్తున్నప్పటికీ, అభివృద్ధి కార్యక్రమాలకయ్యే ఖర్చును మాత్రం అవి భరించడం లేదు. ఈ నేపథ్యంలో ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) వరకు అన్ని పురపాలికలను జీహెచ్ఎంసీలో కలపాలనే ప్రతిపాదనలున్నట్లు సమాచారం.

ఔటర్ దాకా పనులు..

ప్రభుత్వం ఇటీవలి కాలంలో ఏ పనిచేసినా ఔటర్ వరకు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని చేస్తోంది. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు సైతం గతంలో జీహెచ్ఎంసీకి ఉండేవి. ఇటీవలి కాలంలో హైదరాబాద్ అర్బన్ అగ్లామరేషన్ (హెచ్‌యూఏ) పేరిట కేటాయిస్తున్నారు. అంటే విస్తరిస్తున్న శివారు ప్రాంతాల వరకు ఆనిధులు ఖర్చు చేస్తారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ఔటర్ వరకు తాగునీరు, మురుగునీటి సదుపాయాల పనులు జరుగుతున్నాయి. అలాగే శివారు పురపాలికలకు ప్రయోజనం కలిగేలా లింక్ రోడ్లను నిర్మిస్తున్నారు. నాలాలు అభివృద్ధి చేస్తున్నారు. వాటన్నింటి వ్యయాన్ని జీహెచ్ఎంసీయో లేక రోడ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్డీసీఎల్) ఆధ్వర్యంలోనో చేయాల్సి వస్తోంది. ఆయా పురపాలికల్లో జరిగే పనులకు సంబంధిత పురపాలికలు తమవంతు వాటా ధనాన్ని ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నాయి.

బహుళ అంతస్తులు.. భారీ నిర్మాణాలు..

రింగ్‌రోడ్డు పరిసరాల్లో విజయవాడ, నాగార్జునసాగర్, నిజామాబాద్, వరంగల్ హైవే మార్గాల్లో నిర్మాణాలు విపరీతంగా పెరుగుతున్నాయి. బహుళ అంతస్తుల, భారీ భవంతుల నిర్మాణాలు జరుగుతున్నాయి. మణికొండ, నార్సింగి, బండ్లగూడ జాగీర్, తుక్కుగూడ, తుర్కయాంజాల్, పీర్జాదిగూడ, పోచారం తదితర ప్రాంతాల్లో నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. టీఎస్‌బీపాస్ ద్వారా జారీ అవుతున్న నిర్మాణాల్లో ఈ పురపాలికల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. నిర్మాణ అనుమతుల ద్వారా భారీ ఆదాయం లభిస్తున్నప్పటికీ, నిర్వహణ ఖర్చులకే సరిపోతోంది. పురపాలికల్లోని మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు ప్రజాప్రతినిధుల జీతభత్యాలు, వారి సదుపాయాల కోసం, సమావేశాల నిర్వహణకోసం ఎక్కువ ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలోనూ ఓఆర్ఆర్‌లోని పురపాలికలను జీహెచ్ఎంసీలో కలిపే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

త్వరలో ముగియనున్న పాలక మండళ్ల గడువు..

పురపాలికలు, గ్రామపంచాయతీల పాలకమండళ్ల గడువు దాదాపు ఏడాదిన్నరలో ముగియనుంది. ఈలోగా అవసరమైన కార్యక్రమాలు పూర్తిచేసేందుకు వీలుంటుంది.

ప్రతిపాదనల గురించి తెలియదు..

జీహెచ్ఎంసీలో విలీనాన్ని కాదనలేమని రంగారెడ్డి జిల్లా అధికారి ఒకరు పేర్కొనగా, ప్రతిపాదనల గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని జీహెచ్ఎంసీలోని కీలక అధికారి ఒకరు తెలిపారు.

మూడు కార్పొరేషన్లుగా..

పరిధి పెరుగుతున్నందున ఇప్పటికే 650 చ.కి.మీ.ల విస్తరించిన జీహెచ్ఎంసీని ఒకే కార్పొరేషన్‌గా కాకుండా మూడు కార్పొరేషన్లుగా చేయాలనే తలంపు ఉన్నట్లు సమాచారం. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను కూడా కార్పొరేషన్‌లో కలిపేందుకు మార్గం సుగమం కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ కార్పొరేషన్లుగా వీటిని ఏర్పాటు చేసే వీలుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న చౌదరిగూడ, కాచవాని సింగారం, ప్రతాపసింగారం, చౌదరిగూడ వంటి గ్రామ పంచాయతీలను సైతం కలిపే అవకాశాలున్నాయి.

విలీనం కానున్న పురపాలికలు..

విలీనం కానున్న ఓఆర్ఆర్ లోపలి పురపాలికల్లో రంగారెడ్డి జిల్లాలోని బడంగ్‌పేట, మీర్‌పేట్, బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థలు, తుర్కయంజాల్, నార్సింగి, మణికొండ, శంషాబాద్, తుక్కుగూడ, ఆదిభట్ల, పెద్దఅంబర్‌పేట, జల్‌పల్లి పురపాలికలున్నాయి. మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్, జవహర్‌నగర్, నిజాంపేట, పీర్జాదిగూడ నగర పాలక సంస్థలు, దమ్మాయిగూడ, దుండిగల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, నాగారం, పోచారం, తూంకుంటలతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న ఇతరత్రా పురపాలికలు సైతం విలీనమయ్యే అవకాశాలున్నాయి.

84 గ్రామాలకు ఊరట!

111 జీఓను ఎత్తేస్తూ రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం

- ఆ ప్రాంతాల్లో ఇక హెచ్ఎండీఏ విధివిధానాలు
- కొండపోచమ్మతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ అనుసంధానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జీఓ 111ను ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. తద్వారా మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్, షాబాద్, గండిపేట్, చేవెళ్ల మండలాల పరిధిలోని 84 గ్రామాలకు ఊరట లభించింది. ఇకపై ఆయా గ్రామాల్లో హెచ్ఎండీఏ విధివిధానాలే అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయా గ్రామాల్లోని రైతులు,సాధారణ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఐటీ హబ్‌గా అవతరించిన గచ్చిబౌలికి సమీపంలో ఆయా గ్రామాలు ఉండటం, ఆంక్షల ఎత్తివేత ద్వారా 1.30 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సమకూరడం, దీనిలో 30 వేలకుపైగా ఎకరాల ప్రభుత్వ భూములు ఉండటం కలిసి వచ్చే అంశం. కాగా.. సుప్రీం కోర్టు, జాతీయ హరిత ట్రిబ్యూనళ్లలో కేసులు కొనసాగుతుండటం గమనార్హం.

గత ఏడాది ఏప్రిల్‌లోనే ప్రకటన..

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణ కోసం 1996లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 111 జీఓను తీసుకొచ్చింది. జంట జలాశయాల చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలోని 1.32 లక్షల ఎకరాల భూమిని ఈ జీఓ పరిధిలో చేర్చింది. ఆంక్షల కారణంగా స్థానికులు తమ సొంత భూముల్లో ఇళ్లు కట్టుకోలేని దుస్థితి ఏర్పడింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు కూడా తక్కువగా ఉండేవి. స్థానిక ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పర్యావరణ వేత్తలు ఎన్‌జీటీలోనూ, సుప్రిం కోర్టుల్లో కేసులు వేయడంతో ఇప్పటి వరకు ఆంక్షలు కొనసాగుతూ వచ్చాయి. అభివృద్ధికి విఘాతంగా మారిన 111 జీఓను రద్దు చేస్తున్నట్లు 2022 ఏప్రిల్ 19న సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. దీని స్థానంలో కొత్తగా జీఓ నంబర్ 69ని తీసుకొచ్చారు. ఈ మేరకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎలాంటి ముందడుగు పడలేదు. మరోవైపు జీఓ అమలులో ఉందో లేదో తెలియక అధికారులు కూడా కొంత అయోమయంలో పడ్డారు. తాజాగా కేబినేట్ నిర్ణయంతో ఈ విషయంలో ఒక స్పష్టత వచ్చినట్లైంది.

కొండపోచమ్మతో అనుసంధానం

హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు అందించేందుకు నిజాం హయాంలో ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లను కట్టించారు. మొదట్లో నగరానికి ఈ జంట జలాశయాల నీరే ప్రధాన ఆధారం. క్రమేణా నగరం విస్తరించడం, జనాభా పెరగడంతో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మంజీరా, సింగూరు జలాలను ఇక్కడికి తరలించారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నీళ్లు సరఫరా చేస్తున్నారు. తాజాగా 111 జీఓ ఎత్తివేత కారణంగా చెరువు శిఖం భూముల్లో పెద్ద ఎతున నిర్మాణాలు వెలిసే అవకాశం లేకపోలేదు. మురుగు నీరు వచ్చి చెరువులో కలిసే అవకాశం ఉంది. నివాసాల నుంచి వెలువడిన మురుగు నీరు జలాశయాల్లో కలవకుండా ఉండేందుకు ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను నిర్మించనున్నట్లు ప్రకటించారు. జంట జలాశయాలను కొండపోచమ్మతో అనుసంధానించి, నిత్యం నీటితో కళకళలాడేలా చేయాలని నిర్ణయించిన రాష్ట్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది.

రూ.14,912.56 కోట్లు



బ్యాంకర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్

- జిల్లా వార్షిక రుణ ప్రణాళిక విడుదల

ఇబ్రహీంపట్నం రూరల్: బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతులకు సూచించారు. డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో ప్రతీక్‌జైన్ అధ్యక్షతన జరిగింది. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో 2023–24 సంవత్సరానికి రూ.14,912.56 కోట్ల లక్ష్యంతో రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ హరీశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు రుణాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు అవగాహన కల్పించాలని తెలిపారు. వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు రుణాలు అందించాలని బ్యాంకర్లకు సూచించారు. పంట రుణాల పంపిణీ, వ్యవసాయ కాల పరిమితి రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఇచ్చే రుణాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గృహ రుణాల విషయంలో సహకారం అందించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ రావు, ఆర్‌బీఐ అధికారి, నాబార్డు ఏజీఎం, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, జిల్లా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవసరమైతే ఆత్మాహుతి దాడులు!



- హైదరాబాద్–భోపాల్ మాడ్యుల్స్‌ని రెచ్చగొట్టిన అజ్ఞాతవాసి
- సలీమ్, యాసిర్ ఫోన్ల నుంచి ప్రసంగాల ఆడియోలు రికవరీ
- వాటిలో ఫిదాయిన్ దాడులకు సంబంధించిన పలు అంశాలు
- వీటిని పంపింది ఎవరో గుర్తించే పనిలో కేంద్ర నిఘా వర్గాలు
- నేటితో ముగియనున్న 16 మంది ఉగ్రవాదుల పోలీస్ కస్టడీ

సాక్షి, సిటీబ్యూరో: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు హైదరాబాద్–భోపాల్‌ల్లో అరెస్టు చేసిన 16 మంది ఉగ్రవాదుల కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు చేయడానికి సిద్ధమవుతున్న ఈ మాడ్యుల్స్‌కు విదేశాల నుంచి ఆదేశాలు అందుతున్నట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ప్రధాన సూత్రధారులుగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం, భోపాల్ వాసి యాసిర్ ఖాన్ సహా ముగ్గురి నుంచి రికవరీ చేసిన ఫోన్లను ఏటీఎస్ అధికారులు విశ్లేషించారు. ఈ నేపథ్యంలోనే అవసరమైతే ఆత్మాహుతి దాడులు చేయడానికి సిద్ధమవ్వాలంటూ వీరికి ఆదేశాలు అందినట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్ల నుంచి 50 ఆడియోలు రికవరీ..

ఏటీఎస్ అధికారులు హైదరాబాద్‌తో పాటు భోపాల్‌లో అరెస్టు చేసిన 16 మందినీ న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే సిటీలో చిక్కిన అయిదుగురితో పాటు భోపాల్‌లో అరెస్టు అయిన యాసిర్ ఖాన్‌ను నగరానికి తీసుకువచ్చి సీన్ రీ–కన్‌స్ట్రక్షన్ చేసి వెళ్లారు. ఈ ఉగ్రవాదులు సమాచార మార్పిడి కోసం రాకెట్ చాట్, త్రీమా యాప్స్ వినియోగించారు. ఎప్పటికప్పుడు వాటిలోని డేటాను డిలీట్ చేశారు. ఈ కారణంగానే వీరి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో కీలకమైన సమాచారం లభించలేదు. దీంతో వీటిని విశ్లేషించడానికి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. గోల్కొండలో నివసించిన భోపాల్ వాసి మహ్మద్ సలీం, భోపాల్‌లోని షాజహానాబాద్‌కు చెందిన యాసిర్‌తో పాటు మరో ఉగ్రవాది ఫోన్లను విశ్లేషించిన ఫోరెన్సిక్ నిపుణులు వాటి నుంచి కొంత డేటాతో పాటు 50 ఆడియో ఫైల్స్ రికవరీ చేశారు. ఈ ఆడియోల్లోనే ఆత్మాహుతి దాడులకు సంబంధించిన ప్రస్తావన ఉన్నట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు.

టూ వే కమ్యూనికేషన్ ఉన్నప్పటికీ...

ఈ ఆడియోల్లో ప్రసంగించిన వ్యక్తి ఒకేసారి అనేక మందిని చంపడం (మాస్ కిల్లింగ్), సెబోటేజ్ (విధ్వంసాలు సృష్టించడం), ఎంపిక చేసుకున్న వ్యక్తులను హతమార్చడం (టార్గెట్ కిల్లింగ్) అంశాలతో పాటు ఆత్మాహుతి (ఫిదాయిన్) దాడులు సంబంధించిన అంశాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మూడు ఫోన్ల నుంచి రికవరీ చేసిన డేటాలో టూ వే కమ్యూనికేషన్‌ను గుర్తించారు. అంటే ఈ ఉగ్రవాదులతో పాటు వీరికి ఆదేశాలు, సలహాలు సూచనలు ఇచ్చే వ్యక్తికి సంబంధించిన సందేశాలూ రిట్రీవ్ అయ్యాయి. అవి ఎవరు పంపారనేది మాత్రం ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించలేకపోయారు. ఆ వివరాలు కేవలం యాప్‌లోనే నిక్షిప్తమై ఉంటాయని నివేదిక ఇచ్చారు. దీంతో అవతలి వ్యక్తులను గుర్తించడం కోసం కేంద్ర నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. మరోపక్క వీరి ఫోన్లకు కొన్ని పాకిస్థాన్ నంబర్ల నుంచి కాల్స్ వచ్చినట్లు, కాంటాక్ట్స్ లిస్టులోనూ ఆ దేశం నంబర్లు ఉన్నట్లు ఏటీఎస్ చెబుతోంది. అవి ఎవరివి? వారితో వీరికి ఉన్న సంబంధాలేంటి? అనే కోణంలో ఆరా తీస్తోంది.

కొన్ని ఆడియోల్లో కఫీల్ అహ్మద్ ప్రస్తావన..

ముగ్గురు ఉగ్రవాదుల ఫోన్ల నుంచి రిట్రీవ్ చేసిన ఆడియోల్లో లండన్‌లోని గ్లాస్గో విమానాశ్రయంపై 2007లో మానవబాంబు దాడికి ప్రయత్నించిన బెంగళూరు వాసి, వృత్తిరీత్యా డాక్టర్ అయిన కఫీల్ అహ్మద్ ప్రస్తావన ఉన్నట్లు ఏటీఎస్ గుర్తించింది. ఇతడి సోదరుడు నబీల్ అహ్మద్‌ని సైతం ఎన్ఐఏ అధికారులు 2012లో ఢిల్లీలో అరెస్టు చేశారు. లష్కరేతొయిబా (ఎల్ఈటీ) సంస్థ కోసం ఉగ్రవాదులను రిక్రూట్ చేస్తున్నట్లు ఇతడిపై అభియోగాలు ఉన్నాయి. కఫీల్ అహ్మద్ హిజ్బ్ ఉత్ తెహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ తరఫునే మానవబాంబుగా మారాడు. హైదరాబాద్–భోపాల్ మాడ్యుల్ ఉగ్రవాదులూ తొలినాళ్లలో అదే ఉగ్రవాద సంస్థ తరఫున పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఆ ఆడియోలు హెచ్‌యూటీ హ్యాండ్లర్‌గా భావిస్తున్నారు. మరోవైపు ఏటీఎస్ విచారిస్తున్న 16 మంది పోలీసు కస్టడీ గడువు శుక్రవారంతో ముగియనుంది. మరో ఐదురోజులు కస్టడీ కోరాలని ఏటీఎస్ భావిస్తోంది. ఈ కేసులో మరో ముగ్గురు నగర వాసులను సాక్షులుగా చేరుస్తున్నారు. వీరి నుంచీ వాంగ్మూలాలు నమోదు చేయనున్నారు.

గ్రేటర్‌లో ఆరుగురు డీఎంహెచ్‌ఓలు

జీహెచ్ఎంసీ జోన్ల వారీగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

- మరింత తగ్గనున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధి
- పర్యవేక్షణ సులభతరం చేసేందుకే అంటున్న ప్రభుత్వం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆరు జోన్లకు ఆరుగురు డీఎంహెచ్‌ఓలను నియమించాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి ఈ నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో శేర్ లింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్ జోన్లు ఉన్నాయి. ఈ జోన్ల ఆధారంగా డీఎంహెచ్‌ఓ పోస్టులను క్రియేట్ చేయనున్నట్లు ప్రకటించింది. తద్వారా ఆయా ప్రాంతాల్లోని బస్తీవాసులకు సత్వర వైద్య సేవలు అందించడంతో పాటు విపత్తుల సమయంలో క్లోజ్ మానిటరింగ్‌కు అవకాశం ఉంది. జాతీయ టీకాల కార్యక్రమం కూడా సులభతరమవుతుంది. కొత్తగా ఎంపికైన డీఎంహెచ్‌ఓలు ఇకపై జోనల్ కమిషనర్లకే రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

తగ్గనున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖల పరిధి..

ప్రస్తుతం హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ పరిధిలో 91 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 166 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, మరో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలన్నీ హైదరాబాద్ పరిధిలోకి వెళ్లనున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 36 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. వీటిలో 12 తప్ప మిగిలినవన్నీ కొత్త డీఎంహెచ్‌ఓల పరిధిలోకి రానున్నాయి. ఏ ఆరోగ్య కేంద్రం ఏ డీఎంహెచ్‌ఓ పరిధిలోకి వస్తుందనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటి వరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలు.. ఇకపై జోన్ పరిధిలోని డీఎంహెచ్‌ఓల పరిధిలోకి రానుండటంతో ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ పరిధి మరింత తగ్గనుంది.

'పల్లెప్రగతి'తో పంచాయతీలకు మహర్దశ

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాలు, పల్లెలు, తండాల రూపురేఖలు మారాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ పి.రవీందర్ అన్నారు. రానున్న వర్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా కడ్తాల్‌లో జరుగుతున్న కార్యక్రమాన్ని గురువారం డీపీవో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల గురించి సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం తగదని.. తడి, పొడి చెత్తను సేకరించి వేరు చేయాలన్నారు. వాటితో ఎరువులు తయారు చేసుకోవచ్చని, తద్వార పంచాయతీలు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సూచించారు. అనంతరం రైతువేదిక, పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలను సందర్శించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరేందర్‌రెడ్డి, అశోక్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహికులకు ఆర్థిక చేయూత

- స్వయం ఉపాధి సమృద్ధే లక్ష్యం
- పీఎంఎఫ్ఎంఈ దరఖాస్తులకు ఆహ్వానం
- నేడు కలెక్టరేట్‌లో ఆహార శుద్ధి పరిశ్రమల యంత్రాల ప్రదర్శన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్వయం ఉపాధి కల్పన పథకంలో భాగంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, చిరు వ్యాపారులు, నిరుద్యోగులకు ఆర్థికంగా చేయూతనందించి, వారితో ఆహార శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఇందుకోసం ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని తీసుకొచ్చింది. ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తుదారులకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. పరిశ్రమను ఏర్పాటు చేయాలనే సంకల్పం, కష్టపడి పని చేసే తత్వంతో పాటు 18 ఏళ్లు నిండితే చాలు.

రాయితీలు వర్తించే పరిశ్రమలు ఇవే ..

బేకరీ ఉత్పత్తులు, తృణధాన్యాలు, పప్పు ఆధారిత ఉత్పత్తులు, సిట్రస్ ఆధారిత ఉత్పత్తులు, కొబ్బరి, మొక్కజొన్న, పండ్లు, వేరుశనగ, పాలు, పుట్టగొడుగు, నూనె గింజల ఆధారిత పరిశ్రమల్లోని యంత్రాలను సబ్సిడీపై అందజేస్తారు. వ్యక్తిగత మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఖర్చులో 35 శాతం గరిష్ఠ పరిమితితో యూనిట్‌కు రూ.10 లక్షల వరకు రుణ రాయితీ కల్పిస్తారు. గ్రూప్ ఎంటర్ ప్రైజెస్ ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం రాయితీ ఉంటుంది. ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నడుపుతున్న వారు కూడా తమ పరిశ్రమను పునరుద్ధరించుకునేందుకు ఈ పథకంలో అవకాశం కల్పించారు.

నేడు ఫుడ్ ప్రాసెసింగ్ మెషనరీ ఎక్స్‌పో

తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, జిల్లా పరిశ్రమల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కొంగరలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్ మెషనరీ ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. మంత్రి సబితారెడ్డి ఈ ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. ఆహార శుద్ధికి సంబంధించిన అన్ని రకాల యంత్రాలను ఈ ప్రదర్శనలో ఉంచనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కేసీఆర్ కిట్లను సద్వినియోగం చేసుకోండి



కేసీఆర్ న్యూట్రీషన్ కిట్‌లను పరిశీలిస్తున్న డాక్టర్ జయలక్ష్మి తదితరులు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి కోరారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లను సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ..గర్భిణులు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడంతో పాటుగా తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోషక విలువలు కలిగిన గుడ్లు, పప్పులు, ఆకుకూరలు, పండ్లు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రక్తహీనతకు గురయ్యే గర్భిణులకు ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లను అందజేస్తుందని తెలిపారు. 14 వారాల నుంచి 26 వారాల మధ్య ఉన్న గర్భిణులు రెండో చెకప్‌కు వచ్చినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లను అందజేస్తామన్నారు. ఈ కిట్‌లో కిలో న్యూట్రీషన్ పౌడర్, కిలో ఖర్జూరా పండ్లు, 500 గ్రాముల ఆవు నెయ్యి, మూడు ఐరన్ సిరప్ బాటిల్స్, రెండు పల్లీ పట్టీలను అందించనున్నట్లు వివరించారు. నిరుపేద గర్భిణిలకు ఈ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, కేసీఆర్ కిట్ ఇన్‌చార్జి అరుణ, అన్వర్, హరీశ్, రవికుమార్ పాల్గొన్నారు.

వ్యాపారంగా మారిన విద్యావ్యవస్థ

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

షాబాద్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోతోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. గురువారం షాబాద్ మండలం నాన్‌ధార్‌ఖాన్‌పేట్‌కు చెందిన ఏబీవీపీ కార్యకర్త శ్రీకాంత్ పోలీసుల లాఠిచార్జిలో గాయపడటంతో ఆమె పరామర్శించారు. శ్రీకాంత్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య వ్యాపారంగా మారిందన్నారు. గురునానక్, శ్రీనిధి యూనివర్సిటీలకు పర్మిషన్ లేకున్నా నడిపిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఉన్నత విద్యా మండలి దగ్గర శాంతి యుతంగా నిరసన తెలుపుతుంటే అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆమె వెంట శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్ మహేశ్, మణికంఠ, కార్యకర్తలు తదితరులున్నారు.



శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

ఇరువర్గాల ఘర్షణ

15 మందిపై కేసు

షాద్‌నగర్‌రూరల్: ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు, అదే వార్డుకు చెందిన అశోక్ మధ్య కొన్ని రోజులు క్రితం వివాదం నెలకొంది. దీంతో ఇరువర్గాలు కాలనీలో ఘర్షణకు దిగారు. ఈ విషయమై ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఇరు వర్గాల వారు వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని చెదరగొట్టారు. ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన 15 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. స్వచ్ఛభారత్ మిషన్, క్రీడా ప్రాంగణాలు మొదలైన ఉపాధి హామీ పనులపై జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పనులు పెండింగ్ లేకుండా త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీడీఓలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయుటలో నిర్లక్ష్యం వహించకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, అడిషనల్ పీడీ నీరజా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: ఈతకు వెళ్లి చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామ శివారులో గురువారం ఈ ఘట చోటు చేసుకుంది. మండల పరిధిలోని కంసాన్‌పల్లికి చెందిన సాయిలు (40) బుధవారం గ్రామ శివారులోని చెరువులో ఈతకు వెళ్లాడు. నీట మునిగి గల్లంతయ్యాడు. రెండో రోజు నీటిపై మృతదేహం తేలడంతో పోలీసులు మృదేహన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరామర్శించిన వీర్లపల్లిశంకర్

చెరువులో పడి మృతి చెందిన సాయిలు కుటుంబాన్ని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లిశంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య అంజమ్మకు రూ 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో కృష్ణారెడ్డి, రఘు, సుదర్శన్, శేఖర్, మున్నా, సీతారాం తదితరులు ఉన్నారు.

సర్పంచ్ ఆర్థిక సాయం

సాయిలు కుటుంబానికి సర్పంచ్ పద్మానరేందర్ రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న శంకర్

ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సాయిలు కుటుంబానికి అండగా ఉంటామని సర్పంచ్ తెలిపారు.

స్టోన్ క్రషర్లు, క్వారీలకు అనుమతివ్వం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టీకరణ

యాచారం: స్టోన్ క్రషర్లు, క్వారీలకు అనుమతి ఇచ్చే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మొండిగౌరెల్లిలోని సర్వే నంబరు 19లో 14 ఎకరాలకు పైగా ప్రభుత్వ గుట్టల్లో ఓ వ్యాపారి స్టోన్ క్రషర్, క్వారీ నిర్వహించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మొండిగౌరెల్లిలోని మెజార్టీ వర్గం స్టోన్ క్రషర్లు, క్వారీని వద్దని ఆందోళన చేస్తున్నారు. ఈ విషయమై స్టోన్ క్రషర్, క్వారీని వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చేదిలేదని ఎమ్మెల్యే వీరికి హామీ ఇచ్చారు.

మద్దతు దారులకు చీవాట్లు..

మొండిగౌరెల్లిలో స్టోన్ క్రషర్, క్వారీ నిర్వహించేలా వ్యాపారికి మద్దతుగా కొంత మంది పెద్దలు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ మీ స్టోన్ క్రషర్, క్వారీకి అనుమతిస్తే ఇంకా 18 వాటికి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అయినా వ్యవసాయ భూముల్లో ఆకుకూరలు, కూరగాయల పంటలు పండిస్తారని, స్టోన్ క్రషర్లు, క్వారీలు వస్తే దుమ్ము, ధూళికి వాతావరణ కాలుష్యం ఏర్పడటమేకాక, బోరుబావులు పూడుకుపోతాయన్నారు. మిమ్మల్ని కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే.. మొండిగౌరెల్లి గ్రామంలో స్టోన్ క్రషర్, క్వారీకి అనుమతి ఇచ్చేప్రసక్తేలేదని స్పష్టం చేసిన ఎమ్మెల్యేకు ఆ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై ఎందుకీ వివక్ష?



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు

నిలదీసిన అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తామని చెప్పిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ వివక్ష చూపుతున్నారని అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి సాధన కోసం ఈ నెల 22న నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని కాళేశ్వరం పేరుతో రీ డిజైన్‌చేసి రంగారెడ్డి జిల్లాకు గోదావరి నీళ్లు రాకుండా చేశారని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల్లోకి ప్రవేశిస్తున్న రాష్ట్రంలో ఈ రెండు జిల్లాపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ గత పదేళ్లలో అనేక సభల్లో పాలమూరు–రంగారెడ్డి పథకాన్ని జాతీయ పథకంగా చేపడతామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. గత ఎన్నికల సమయంలో మూడేళ్లలోపు పూర్తి చేస్తామన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను సాధించే వరకు శాంతియుత, ప్రజాస్వామిక పద్ధతిలో ఆందోళన చేపట్టాలనే ఆలోచనతో ఈ నెల 22న మహాధర్నా చేపట్టినట్టు చెప్పారు. ధర్నాకు ప్రొఫెసర్ హరగోపాల్ హాజరు కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీర్లపల్లిశంకర్, ఎండీ ఇబ్రహీం, దొడ్డి శ్రీనివాస్, బుద్దుల జంగయ్య, రవీంద్రనాథ్, నర్సింలు, సత్యం , రవికుమార్, కృష్ణ, తిరుమలయ్య, రాజు, కృష్ణారెడ్డి, రఘు, తిరుపతిరెడ్డి, కొమ్ముకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్ అలీఖాన్, సీతారాం, సుదర్శన్, ఖదీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం రూరల్: పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 19న జరగనున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఈనెల 21, 22వ తేదీల్లో జరుగనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) రాత పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ ఎస్. తిరుపతి రావు తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పోస్టులకు 21న 3,948 మంది , 22న 4,086 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి12:30 వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

సీసీఎస్ వద్ద క్యూనెట్ బాధితుల ఆందోళన

హిమాయత్‌నగర్: ఉద్యోగాలు ఎర వేసి రూ.లక్షలు కాజేసి 'క్యూనెట్' సంస్థ తమను మోసం చేసిందని తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 'క్యూనెట్' కేసులో నిందితులు ఇటీవల బెయిల్‌పై విడుదల కావడంతో..గురువారం బాధితులు సీసీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విషాదం నింపిన సెల్ఫీ సరదా

చెరువులో మునిగి ఇద్దరు యువకుల మృతి





సోఫియాన్, అనాస్‌ల మృతదేహాలు

అబ్దుల్లాపూర్‌మెట్: సెల్ఫీ సరదా ఇద్దరు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని బాగ్‌అంబర్‌పేట్ 6వ నంబర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సోఫియాన్ హుస్సేన్ (18) వేసవి సెలవులు కావడంతో తుర్కయంజాల్‌లో నివాసం ఉండే తమ బంధువు సయ్యద్ అనాస్ (14) ఇంటికి వచ్చాడు. వీరిద్దరూ మరో ఇద్దరు యువకులతో కలిసి గురువారం మధ్యాహ్నం సంఘీనగర్‌లోని చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ సెల్ఫీలు దిగుతుండగా.. ప్రమాదవశాత్తు సయ్యద్ అనాస్ చెరువులో పడిపోయాడు. గమనించిన సోఫియాన్ వెంటనే చెరువులో దిగి అనాస్‌ను కాపాడేందుకు యత్నించాడు. అయితే.. చూస్తుండగానే ఇద్దరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వానాకాలం పంటలకు సిద్ధంకండి



వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: వానాకాలం పంటలకు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ, జిల్లా సహకార సంస్థ, మార్క్‌ఫెడ్ అధికారులతో కలెక్టర్ హరీష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ మరో పక్షం రోజుల్లో వానాకాలం పంటల సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. జిల్లాలో 4,39,750 ఎకరాలలో సాగు చేస్తారని అంచనా ఉందన్నారు. అందుకు అనుగుణంగా ఎరువుల విషయంలో రైతులు అనవసర ఆందోళనకు గురి కాకుండా, వారి అవసరాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయని రైతులుకు సమాచారం అందించాలన్నారు. ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా యూరియా, ఎరువులను తెప్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి, జిల్లా సహకార సంస్థ అధికారి ధాత్రి దేవి, మార్క్‌ఫెడ్ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాసా సదస్సుకు వెళ్లే విద్యార్థులకు చేయూత

నాట్కో ఫార్మా రూ.5లక్షల సాయం



ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ధనుంజయ్‌కి చెక్కు అందజేస్తున్న నాట్కో ఫార్మా ప్రతినిధులు

మహేశ్వరం: టెక్సాస్ (అమెరికా) నగరంలో నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌కు మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి గురువారం నాట్కో ఫార్మా లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం రూ.5లక్షల చెక్కును అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్‌కు అందజేశారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను అందిపుచ్చుకుంటూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని నాట్కో ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని విధాల సహకారం అందిస్తున్న మంత్రి సబితారెడ్డి, నాట్కో ఫార్మా కంపెనీ యాజమాన్యానికి, డీఈఓ సుశీంధర్ రావు, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్‌రెడ్డి, యాదయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కేసీ తండా సర్పంచ్ మోతీలాల్ నాయక్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బాబు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా వీసా..

అమెరికా వెళ్తున్న మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులకు వీసా జారీ చేశారు. వీరు ఈ నెల 25వ తేదీ నుంచి 28వరకు అమెరికా (టెక్సాస్) నగరంలో జరిగే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి వెళుతున్నారు. గురువారం హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. బి–1, బి–2 వీసా జారీ చేశారు. తమకు అన్ని విధాల సహకరిస్తున్న మంత్రి సబితారెడ్డికి మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్, సీనియర్ ఉపాధ్యాయులు బాబు కృతజ్ఞతలు తెలిపారు.

రుణం ఇప్పిస్తామని..

రూ. 25 లక్షలు కాజేశారు..

శంషాబాద్: పరిశ్రమ కోసం కోట్ల రూపాయల్లో రుణం ఇప్పిస్తామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలకు పైగా కాజేసిన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... చాంద్రాయగుట్టకు చెందిన నవాజ్ ఖాన్‌కు ఢిల్లీలో ఉంటున్న తన బంధువుల ద్వారా ఇమ్రాన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. 15 రోజుల కిందట ఇమ్రాన్ ద్వారా ధమన్‌జిత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. నవాజ్‌ఖాన్ సోదరుడి పరిశ్రమ నిర్వహణకు గాను పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. ఇందుకు గాను రూ. 50 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన నవాజ్‌ఖాన్ ఈ నెల 16న అత్తాపూర్‌లోని ఓ హోటల్ వద్ద ధమన్‌జిత్‌తో పాటు అతని వెంట ఉన్న సునీల్‌ఖాత్రీ, అమిత్, సౌరభ్‌గుప్తాలను కలిశాడు. వారి మాటలు నమ్మిన నవాజ్‌ఖాన్ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.4.32 లక్షలు, స్నేహితుడి ఖాతా నుంచి రూ. 4.18 లక్షలు బదిలీ చేయడంతో పాటు రూ. 5 లక్షల నగదు ఇచ్చాడు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం నోవాటెల్ హోటల్ వద్ద ముఖ్యమైన వ్యక్తి కలుస్తాడని అక్కడికి రావాలని చెప్పారు. నోవాటెల్ హోటల్ గదిలోకి వెళ్లిన తర్వాత మరో రూ.11 లక్షలు ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. కొద్ది సేపట్లో అసలు వ్యక్తి వచ్చి కలుస్తాడని నవాజ్‌ఖాన్‌ను గదిలోనే కూర్చోబెట్టి బయటికి వెళ్లారు. వారు ఎంతకూ తిరిగి రాకపోవడంతో, ఫోన్లు చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన నవాజ్‌ఖాన్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులందరూ ఢిల్లీకి చెందిన వారే కావడం గమనార్హం.